సాక్షి
ములుగు
బుధవారం । 29 । జనవరి । 2025



రేషన్ బియ్యం పట్టివేత

ఓ మిల్లులో అక్రమంగా నిల్వచేసిన 216 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ ప్రభాకర్‌రావు తెలిపారు. - 8లో▸



వేసవికి సన్నద్ధం కావాలి

వేసవిలో విద్యుత్ సంబంధ సమస్యలు నివారించేందుకు అధికారులు ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయాలని ఎన్పీడీ సీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$30^0/17^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఉక్కపోత, ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

'ఒక్కో తరగతికి ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలి'



ములుగు: పాఠశాల విద్యలో ఒక్కో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించేలా చూడాలని పీఆర్టీయూ తెలంగాణ సంఘం జిల్లా అధ్యక్షుడు కొయ్యడ సురేందర్, ప్రధానకార్యదర్శి రామన్ననాయక్ కోరారు. ఈ మేరకు మంగళవారం విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పలు రకాల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ విధానాన్ని అమలు చేయాలని కోరినట్లు తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో ఆడియో విజువల్ లర్నింగ్ ఏర్పాటు చేయడంతో పాటు జీఓ 317 ప్రకారం అంతర్ జిల్లా ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరించాలని కోరడంతో పాటు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు.

3కే రన్ విజేతలకు షూస్ అందజేత



ఎస్‌ఎస్ తాడ్వాయి: ఇటీవల జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలో ఎస్పీ శబరీశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 3కే రన్‌లో పురుషుల విభాగంలో మండల పరిధిలోని కాల్వపల్లికి చెందిన కుర్సం రవి, మహిళల విభాగంలో వెంగలాపూర్‌కు చెందిన తెల్లం ప్రియాంకలు ప్రథమ స్థానం సాధించారు. ఈ మేరకు వారిని మంగళవారం మేడారంలోని కమాండ్ కంట్రోల్ రూం ఆవరణలో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి షూస్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై జగదీశ్వర్‌రెడ్డి, ఏఎస్సై చింత నారాయణ, కానిస్టేబుల్ పూజారి రమేష్, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి పాల్గొన్నారు.

రామప్ప టెంపుల్ బాగుంది



వెంకటాపురం(ఎం): రామప్ప టెంపుల్ బ్యూటిఫుల్‌గా ఉందని, ఇలాంటి శిల్పాలను మరెక్కడ చూడలేదని ఫ్రాన్స్ దేశస్తులు హెరిక్, స్టీవెన్‌లు, అమెరికాకు చెందిన టీన్ కొనియాడారు. రామప్ప ఆలయాన్ని వారు వేర్వేరుగా మంగళవారం సందర్శించి రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. వారికి గైడ్‌లు వెంకటేశ్, విజయ్‌కుమార్ ఆలయ విశిష్టత గురించి వివరించారు. రామప్ప శిల్పాల వద్ద ఫొటోలు దిగుతూ ఆలయ అందాలను తమ సెల్‌ఫోన్‌లలో బంధించుకున్నారు.

కోర్టు తీర్పుపై హర్షం



భూపాలపల్లి రూరల్: రైతు ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును రైతు స్వరాజ్య వేదిక జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేస్తుందని ఆ సంఘం జిల్లా కన్వీనర్ కర్నాటకపు సమ్మయ్య తెలిపారు. మంగళవారం జిల్లాకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైకోర్టు తీర్పునకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.9.98కోట్ల పరిహారం విడుదల చేసిందన్నారు. ఇది రైతుల విజయమన్నారు. ఈ సమావేశంలో యాస నర్సయ్య పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

కాటారం: సూర్యాపేటలో కులాంతర వివాహం చేసుకున్నాడని కృష్ణ అనే దళితుడిని రాళ్లతో కొట్టి ఉరివేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఉత్తర తెలంగాణ మాల మహానాడు అధ్యక్షుడు పీక కిరణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరువు హత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. జాతీయ, రాష్ట్ర ఎస్సీ కమిషన్, హైకోర్టు కేసును సుమోటోగా స్వీకరించి నిందితులను కఠినంగా శిక్షించాలని మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కిరణ్ కోరారు.

పెట్టుబడి సాయం

6,678మంది రైతుల ఖాతాల్లో రూ.8.26కోట్లు జమ

- రైతుభరోసా డబ్బులు అందుతుండడంతో అన్నదాతల్లో ఆనందం
- మిగిలిన రైతులకు విడతల వారీగా చెల్లింపు



వెంకటాపురం(ఎం): రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రైతుభరోసా పథకం కింద డబ్బులను జమ చేస్తోంది. గణతంత్ర దినోత్సవం రోజున సీఎం రేవంత్‌రెడ్డి నాలుగు సంక్షేమ పథకాలను ప్రారంభించారు. అందులో భాగంగా రైతు భరోసా కింద అర్హులైన రైతులకు ఎకరాకు రూ.6 వేల చొప్పున సోమవారం మధ్యాహ్నం ప్రభుత్వం నిధులను జమ చేయడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని మండలానికి ఒక గ్రామం చొప్పున అధికారులు తొలుత 10 గ్రామాలను ఎంపిక చేశారు. ఈ క్రమంలో ఆయా గ్రామాల్లోని 6,678 మంది రైతులకు ప్రభుత్వం రూ.8.26 కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసింది.

86,338 మంది రైతులకు.. రూ.106.57 కోట్లు

జిల్లాలోని 10 మండలాల పరిధిలో 86,338 మంది రైతులు 1,77,631 ఎకరాల్లో యాసంగి పంటను సాగు చేస్తున్నారు. ఎకరానికి రూ.6వేల చొప్పున పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం రూ.106.57 కోట్లను జమ చేయాల్సి ఉండగా సోమవారం రూ.8.26 కోట్ల నిధులను జమ చేసింది. మిగిలిన రైతులకు విడతల వారీగా మార్చి 31వ తేదీలోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని అధికారులు చెబుతున్నారు.

ప్రస్తుత సీజన్‌కు మాత్రమే..

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తికాగా పంటలకు సంబంధించి వానాకాలం సీజన్ ముగిసింది. ప్రస్తుతం యాసంగి పంటలు సాగు అవుతున్నాయి. దీంతో రెండు సీజన్లకు కలిపి ఎకరాకు రూ.6వేల చొప్పున రూ.12వేలు జమ చేస్తారని రైతులు భావించారు. కానీ ప్రభుత్వం ప్రస్తుత సీజన్‌కు రూ.6వేల చొప్పున మాత్రమే జమ చేసింది. గత ప్రభుత్వం 2018 నుంచి ప్రతీ సీజన్‌లో ఎకరాకు రూ.5 వేల చొప్పున చెల్లించగా, ప్రస్తుత ప్రభుత్వం ఎకరాకు వెయ్యి రూపాయలు పెంచి రూ.6వేలు చెల్లిస్తోంది. గత వానాకాలం సీజన్ పెట్టుబడి సాయం కూడా ప్రభుత్వం అందిస్తుందని భావించినప్పటికీ యాసంగి పంటకు మాత్రమే పెట్టుబడి సాయం విడుదల చేస్తుండడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు.

2,800 ఎకరాల భూములు తొలగింపు

జిల్లా వ్యాప్తంగా 2,800 ఎకరాల భూములు సాగుకు యోగ్యం కావని అధికారులు తేల్చారు. గత ప్రభుత్వం వ్యవసాయ భూములన్నింటికీ రైతు బంధు పథకాన్ని అమలు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం సాగుకు యోగ్యం కాని భూములకు రైతు భరోసా ఇచ్చేదిలేదని స్పష్టం చేస్తూ అధికారులతో సర్వే నిర్వహించింది. దీంతో సాగుకు యోగ్యం కాని భూములను రైతు భరోసా పోర్టల్ నుంచి అధికారులు తొలగించారు.

దశలవారీగా రైతుల ఖాతాల్లో జమ



జిల్లా వ్యాప్తంగా 86,338 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్నాయి. రైతు భరోసా పథకం కింద ప్రతీ రైతుకు పెట్టుబడి సాయం దశలవారీగా రైతు ఖాతాల్లో జమ అవుతాయి. కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు, గతంలో పెట్టుబడి సాయం అందని రైతులు ఈనెల ఖరులోగా స్థానిక ఏఈఓలకు దరఖాస్తులతో పాటు ధ్రువీకరణ పత్రాలు అందించాలి.

– సురేష్‌కుమార్, డీఏఓ

రైతు భరోసా డబ్బులు పడ్డాయి..



రైతు భరోసా పథకం కింద డబ్బులు బ్యాంకు ఖాతాల్లో పడినట్లు ఫోన్‌కు మేసేజ్ వచ్చింది. ఏటీఎంకు వెళ్లి చెక్ చేసుకున్నాను. ఎకరానికి రూ.6వేల చొప్పున పడ్డాయి. 6.09 ఎకరాలకు రూ.37,350 పెట్టుబడి సాయం అందడంతో కొంత ఆర్థికభారం తగ్గనుంది.

– అల్లాడి రాజేశ్వర్‌రావు, వెంకటాపురం(ఎం)

ఆనందంగా ఉంది..



నా పేరు మీద 26 గుంటల భూమి ఉంది. సోమవారం రూ.3,900 ఖాతాలో జమ అయ్యాయి. రైతు భరోసా కింద డబ్బులు ఇచ్చిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. యాసంగిలో పంట పెట్టుబడికి సాయం అందడంతో ఆనందంగా ఉంది.

– మామిడిపెల్లి నీలమ్మ, వెంకటాపురం(ఎం)

వానాకాలం పంటకు వర్తింపజేయాలి



ప్రస్తుత యాసంగి పంటకు పెట్టుబడి సాయం ప్రభుత్వం అందించడంతో రైతులకు వెసులుబాటు కలిగింది. గత వానాకాలం పంటకు కూడా రైతు భరోసా పథకాన్ని వర్తింపజేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి. 5.13 ఎకరాలకు రూ.31,950లు ఖాతాలో ప్రభుత్వం జమ చేసినట్లు మేసేజ్ వచ్చింది.

– ముంజ సాంబయ్య, వెంకటాపురం(ఎం)

ఫిబ్రవరి 3లోగా పనులు పూర్తిచేయాలి

కలెక్టర్ టీఎస్.దివాకర్



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఎస్‌ఎస్ తాడ్వాయి: ఫిబ్రవరి 3వ తేదీలోగా మేడారం మినీ జాతర పనులన్నీ పూర్తి చేయాలని కలెక్టర్ దివాకర్ అధికారులను ఆదేశించారు. మేడారంలో కలెక్టర్ మంగళవారం ఇంజనీరింగ్ శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. చింతల్ క్రాస్ రోడ్డు, కన్నెపల్లి, మేడారంలో జరుగుతున్న మినీ జాతర పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మేడారం జంపన్నవాగులో భక్తుల పుణ్య స్నానాల కోసం చేపట్టనున్న ఏర్పాట్లను పరిశీలించారు. కన్నెపల్లిలోని సారలమ్మ దేవాలయ పరిధిలోని పనులు, పార్కింగ్ స్థలాలు, జంపన్న వాగు వద్ద తాత్కాలిక డ్రెసింగ్ గదులు, వీఐపీ, వీవీఐపీ పార్కింగ్ స్థలాల ఏర్పాటు పనులు సైతం గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు కూడా పనుల్లో వేగం పెంచాలన్నారు. జాతర సమీపిస్తున్నందున పనుల ఏర్పాట్లలో నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. కలెక్టర్ వెంట ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, పీఆర్ ఈఈ అజయ్‌కుమార్, ఇరిగేషన్ ఈఈ నారాయణ, తాడ్వాయి డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణతకు కృషి

డీసీఈబీ కార్యదర్శి సూర్యనారాయణ



ప్రణాళిక బుక్‌ను ఆవిష్కరిస్తున్న సూర్యనారాయణ, ఉపాధ్యాయులు

ములుగు: మార్చిలో జరగబోయే 10వ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీసీఈబీ కార్యదర్శి సూర్యనారాయణ సూచించారు. ఈ మేరకు 40రోజుల ప్రత్యేక ప్రణాళిక బుక్‌ను మంగళవారం జిల్లాకేంద్రంలో బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఉదయం, సాయంత్రం గంట సేపు అదనపు తరగతుల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫిబ్రవరి 17నుంచి పూర్తి సిలబస్‌తో వార్షిక పరీక్షల మాదిరిగా గ్రాండ్ టెస్టులు నిర్వహించాలని అన్నారు. మార్చి 6న నుంచి ప్రీఫైనల్ పరీక్షలు ఉంటాయని వివరించారు.

'ఏకీకృత పెన్షన్ విధానాన్ని అడ్డుకుంటాం'



రాయినిగూడెం పాఠశాలలో ప్రతులను దహనం చేస్తున్న ఉద్యోగులు

ములుగు రూరల్/ఎస్‌ఎస్ తాడ్వాయి: ఏకీకృత పెన్షన్ విధానాన్ని(యూపీఎస్) అడ్డుకుంటామని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నవరం రవికాంత్, ప్రధాన కార్యదర్శి మంకిడి రవి అన్నారు. ఈ మేరకు మంగళవారం యూపీఎస్ ప్రతులను మండల పరిధిలోని రాయినిగూడెం ఆశ్రమ పాఠశాలలో ఉద్యోగులు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉద్యోగ సంఘాలు పోరాటాలు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ విధానాన్ని తీసుకు రావడం అప్రజాస్వామికమన్నారు. ఈ విధానాన్ని మానుకుని తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రావణ్‌కుమార్, కిషన్‌సింగ్, దేవిసింగ్, సంఘం నాయకులు సుధాకర్, నరేష్, శ్రీధర్, సమ్మయ్య, కుమారస్వామి, అరుణ, సౌమ్య, జయ, ఇందిర ప్రియ, దర్శిని, సూరయ్య, నరహరి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఎస్‌ఎస్ తాడ్వాయి మండల కేంద్రంలోని ఇందిరానగర్ జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు యూపీఎస్ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎస్, యూపీఎస్ పత్రులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్, యూపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రారెడ్డి, లక్ష్మయ్య, రేణుక, రజిత, వనతి, రాజబాబు పాల్గొన్నారు.

త్వరలో 'సూపర్ స్పెషాలిటీ' ప్రారంభం

ఎమ్మెల్యేల విజ్ఞప్తి మేరకు సీఎం నిర్ణయం

- మరింత వేగంగా ఆస్పత్రి నిర్మాణ పనులు
- వివిధ పనులపై 31న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యేలు, నాయకులు

సాక్షిప్రతినిధి, వరంగల్ :

వరంగల్ జిల్లా అభివృద్ధిపై పలువురు ఎమ్మెల్యేలు మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, రామచంద్రునాయక్, గండ్ర సత్యనారాయణ రావు, కేఆర్ నాగరాజు, మామిడాల యశస్వినిరెడ్డితోపాటు పీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వరంగల్ నగరంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను వేగవంతంగా పూర్తి చేసి వీలైనంత త్వరలో ప్రారంభించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. రాంపూర్–మడికొండ మధ్య ఉన్న డంపింగ్ యార్డ్ పొగ ద్వారా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే డంపింగ్ యార్డ్‌ను అక్కడినుంచి తరలించాలని కోరారు. గ్రేటర్ వరంగల్ నగరానికి మంజూరైన అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ పనుల డీపీఆర్ తయారు చేసి త్వరితగతిన పనులు చేపట్టే విధంగా అధికారులకు ఆదేశాలివ్వాలని ఎమ్మెల్యేలు.. సీఎంను కోరారు. వీటిపై సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ సంబంధిత అధికారులకు ఫోన్‌లో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ నెల 31న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నారు. అనంతరం స్టేషన్ ఘనపూర్‌ను మున్సిపాలిటీగా ప్రకటించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కడియం శ్రీహరి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

'రోగులకు మెరుగైన వైద్యం అందించాలి'



వైద్య సిబ్బందికి శిక్షణ ఇస్తున్న డాక్టర్ రణధీర్

ములుగు: రోగులకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా చైల్డ్ అండ్ ఇమ్యునైజేషన్ అధికారి రణధీర్, డాక్టర్ పవన్‌కుమార్ సూచించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో వైద్యారోగ్యశాఖ సమావేశ మందిరంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు, ఆరోగ్య కార్యకర్తలకు మంగళవారం నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ శిబిరంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం సబ్ సెంటర్, పీహెచ్‌సీలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సబ్ సెంటర్‌కు వచ్చే ప్రజలను సాదరంగా ఆహ్వానించి కావాల్సిన వైద్యం అందించాలన్నారు. గ్రామాల్లో వైద్యసేవలు మెరుగుపడితేనే శాఖకు మంచి పేరు వస్తుందని వివరించారు. సబ్ సెంటర్లకు ఎన్‌క్వాస్(నేషనల్ క్వాలిటీ అసూర్యెన్స్ స్టాండర్స్)నిబంధనలు పాటిస్తే ప్రత్యేక నిధులు మంజూరు అవుతాయని తెలిపారు.

పరిహారం అందించాలి

కాటారం: చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా చేపట్టనున్న కాల్వ నిర్మాణ పనుల్లో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందించిన తర్వాతే పనులు చేపట్టాలని ఆదివారంపేట, గుమ్మాళ్లపల్లి గ్రామాల రైతులు అధికారులను మంగళవారం అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆయా గ్రామాల్లోని చెరువుల్లోకి నీరు నింపేందుకు కాల్వల నిర్మాణం కోసం అధికారులు సర్వే చేపట్టారు. విషయం తెలుసుకున్న రైతులు సర్వేను అడ్డుకోవడానికి వెళ్లగా ముందస్తుగా పోలీసులు చేరుకొని వారిని నిలువరించారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలపడంతో రైతులు అధికారులతో మాట్లాడి తమ సమస్యను విన్నవించారు. గతంలో పైప్‌లైన్‌లో భాగంగా కోల్పోయిన భూములకు ఇప్పటివరకు పరిహారం అందలేదని తెలిపారు. పరిహారం అందించిన తర్వాతనే సర్వే, నిర్మాణ పనులు కొనసాగించాలని అధికారులకు తేల్చిచెప్పారు. దీంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని సర్వే అధికారులు రైతులకు నచ్చజెప్పారు.

వైద్యం అందరికీ అందేలా కృషి

డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు



కంటైనర్ ఉప కేంద్రం కోసం స్థల పరిశీలన చేస్తున్న డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు



డెలవరీ మహిళతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు

కన్నాయిగూడెం: ఏజెన్సీలోని ప్రతీ పల్లెకు వైద్యం అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు అన్నారు. మండల పరిధిలోని ఐలాపూర్‌లో కంటైనర్ వైద్య ఉపకేంద్రం ఏర్పాటు చేసేందుకు మంగళవారం స్థానిక వైద్యుడు అభినవ్‌తో కలిసి స్థల పరిశీలన చేశారు. అనంతరం ఫిబ్రవరిలో ఐలాపూర్‌లో జరిగే సమ్మక్క–సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరం ఏర్పాటు చేసే స్థలాన్ని గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. అనంతరం వనదేవతలకు మొక్కులు చెల్లించారు. అనంతరం కన్నాయిగూడెం పీహెచ్‌సీ పరిధిలోని కొండాయి, చిన్నబోయినపల్లి ఆయుష్మాన్ కేంద్రాలను పరిశీలించి రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఏజెన్సీలోని మారుమూల గ్రామమైన ఐలాపూర్‌లో కంటైనర్ వైద్య ఉప కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

ఎస్‌ఎస్ తాడ్వాయి: మండలం కేంద్రంలోని తాడ్వాయి పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని సిబ్బంది అటెండెన్స్, రోగుల ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. డెలవరీ మహిళను పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందించే రోజువారి వైద్య సేవలపై వైద్యాధికారి చిరంజీవిని అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో డెలవరీ కేసులు ఎక్కువగా నమోదు కావడంతో ఆయన వైద్యాధికారులు, సిబ్బందిని అభినందించారు.

సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మంగపేట/వాజేడు: పీఎం కుసుమ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అధికారులు మంగళవారం మంగపేట, వాజేడు మండలాల్లో స్థలాలను మంగళవారం పరిశీలించారు. మంగపేట మండల పరిధిలోని మల్లూరులో రెనివబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ (రెడ్కో) సంస్థ ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు రెడ్కో సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా మేనేజర్ మహేందర్‌రెడ్డితో కలిసి రెవెన్యూ అధికారులు మంగళవారం స్థల పరిశీలన చేశారు. రెడ్కో సంస్థ ప్రతినిధులు తహసీల్దార్ తోట రవీందర్ ఆధ్వర్యంలో మల్లూరు హరితహోటల్ వెనుక వైపు ఉన్న 348సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమిని పరిశీలించి గుర్తించారు. అదే విధంగా వాజేడు మండల కేంద్రంలోని స్థానిక ఐటీఐ కళాశాల సమీపంలో స్థలాన్ని రెడ్కో డీఎం మహేందర్, ములుగు డీఈఈ నాగేశ్వరరావు, వాజేడు తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ కుమార స్వామి పరిశీలించారు.

విచారణలో జాప్యం చేయొద్దు

ఎస్పీ కిరణ్ ఖరే



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి: కేసుల విచారణలో జాప్యం వహిస్తే సహించేది లేదని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మంగళవారం జిల్లాలోని పోలీస్ అధికారులతో క్రైమ్ సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. పోలీసు అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పెట్రోలింగ్, బ్లూ కోర్ట్ వాహనాలతో అధికారులు, విజుబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. మహిళలకు వ్యతిరేకంగా జరిగే నేరాలను అదుపుచేస్తూ, సత్వరమే స్పందించాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. దొంగతనం కేసుల్లో అధునాతన సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి బాధితులకు త్వరితగతిన అందేలా చూడాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లావ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయి, బాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్) వాటి నివారణకోసం సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బోనాల కిషన్, డీఎస్పీలు సంపత్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, వర్టికల్ డీఎస్పీ నారాయణనాయక్, జిల్లా పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్‌కు 44 మంది గైర్హాజరు

విద్యారణ్యపురి: దేశంలో ప్రతిష్టాత్మక ఐఐటీ, నిట్‌లలో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు హనుమకొండ, వరంగల్‌లో కలిపి 5 సెంటర్లలో కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించిన మొదటి సెషన్‌లో 1,243మంది అభ్యర్థులకు 1,208మంది హాజరుకాగా 35మంది గైర్హాజరయ్యారు. రెండో సెషన్‌ను మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహించగా అందులో1,133 మంది అభ్యర్థులకు 1,124 మంది హాజరుకాగా 9 మంది గైర్హాజరయ్యారు. రెండు సెషన్లు కలిపి 44మంది గైర్హాజరయ్యారని సిటీ కోఆర్డినేటర్ కె. శ్రీలతారెడ్డి తెలిపారు.

ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. పదోన్నతి పొందిన వారిలో యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల సీనియర్ అసిస్టెంట్ బీసీఎం రాజు, యూనివర్సిటీ న్యాయ కళాశాల సీనియర్ అసిస్టెంట్ ఆర్. స్వరూపరాణి ఉన్నారు. వీరికి వీసీ ప్రతాప్‌రెడ్డి ఉత్తర్వులు అందజేశారు.

కొనసాగుతున్న శిక్షణ..

కాకతీయ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఎన్‌సీసీ జవాన్‌ల శిక్షణ కార్యక్రమంలో కొనసాగుతోంది. మంగళవారం ఈ శిక్షణలో కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి పాల్గొని 'ఆటోమేషన్ టాక్స్ విత్ మ్యాక్రోస్' అనే అంశంపై విస్తృతోపన్యాసం చేశారు. కార్యక్రమంలో ఆ విభాగం అధిపతి రమ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసం..

- ఉద్యోగం కోసం రూ.2.50 లక్షలు పోగొట్టుకున్న యువకుడు

నెల్లికుదురు: ఓ యువకుడు ఆన్‌లైన్‌లో ఉద్యోగ ప్రకటన చూసి రూ.2.50 లక్షలు చెల్లించి మోసపోయాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి గ్రామంలో చోటు చేసుకుది. బాధితుడు కాటమల్ల రాజు కథనం ప్రకారం.. సంవత్సరం క్రితం ఆన్‌లైన్ యాప్‌లో ప్రకటన చూసిన రాజు.. ఉద్యోగం కోసం సంస్థకు రూ.2.50 లక్షలు చెల్లించాడు. అనంతరం ఉద్యోగం కోసం సంస్థకు కొన్ని రోజులుగా ఫోన్ చేస్తున్నాడు. అయితే నిర్వాహకులు స్పందించడం లేదు. దీంతో మోసపోయానని గ్రహించిన రాజు.. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
హోల్‌సేల్ రేటు - 100/-
బ్రైలర్ చికెన్ రేటు - 200/-
స్కిన్‌లెస్ చికెన్ రేటు - 220/-
Cell: 9989299661

రంబుల్ స్ట్రిప్స్‌తోనూ 'ప్రమాదమే'?

మామూనూరు ఘటనాస్థలి వద్ద పరిమితికి మించి మందం

- 7.5 మి.మీలు ఉండాల్సి ఉండగా 30 మి.మీల వరకు ఏర్పాటు
- ఫలితంగా స్పీడ్ బ్రేకర్ల మాదిరి ఉండడంతో ప్రమాదాలు
- ఆటోలు, కార్ల వేగం పూర్తిగా తగ్గడంతో వరుస ఘటనలు
- భారీ వాహనాల వేగం అదుపు తప్పడంతోనే ప్రమాదాలు
- ఐఆర్‌ఎస్ నిబంధనలు పాటించాలంటున్న వాహనదారులు


రోడ్డు ప్రమాద స్థలం వద్ద పరిమితికి మించి మందంతో ఉన్న రంబుల్ స్ట్రిప్స్

సాక్షి, వరంగల్ : మామూనూరు వద్ద ఆదివారం ఉదయం 11.20 గంటలకు జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి కారణం ట్రేలర్ ట్రక్కు డ్రైవర్ డ్రంకెన్ డ్రైవ్ ఓ కారణం కాగా...ఇండియన్ రోడ్డు కాంగ్రెస్ (ఐఆర్‌సీ 35–2015) నిబంధనలకు తిలోదకాలిచ్చి థర్మోప్లాస్టిక్ రంబుల్ స్ట్రిప్స్‌ను స్పీడ్ బ్రేకర్స్ మాదిరి మందం ఎక్కువ ఉండేలా అధికారులు ఏర్పాటుచేయడం కూడా మరో కారణమనే చర్చ జరుగుతోంది. ఐఆర్‌ఎస్ నిబంధనల ప్రకారం.. థర్మోప్లాస్టిక్ రంబుల్ స్ట్రిప్స్‌ను ఏదైనా జంక్షన్ లేదా వంపులు వచ్చే సందర్భాల్లో రోడ్లకు అడ్డంగా వేయాలి. రోడ్ల మధ్యలో, అంచుల వద్ద ఆఫ్ రోడ్‌లో వెళ్లేటప్పుడు డ్రైవర్లను అప్రమత్తం చేయడానికి ఇవి ఉపయోగపడతాయి. అలాగే, థర్మోప్లాస్టిక్ రంబుల్ స్ట్రిప్స్ మందం 7.5 మి.మీ కంటే ఎక్కువ ఉండకూడదు. కానీ మామూనూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనాస్థలిలో ఆరు లేన్ల థర్మోప్లాస్టిక్ రంబుల్ స్ట్రిప్స్ మందం 30 మి.మీల వరకు ఉంది. ఫలితంగా అక్కడ తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయనే వాదన వినబడుతోంది. ఈ ఆరు లేన్లకు సమీపంలోనే మరో ఆరు లేన్ల థర్మోప్లాస్టిక్ రంబుల్ స్ట్రిప్స్ మందం 7.5 మి.మీ ఉంది. వెంటవెంటనే ఉన్న ఈ స్ట్రిప్స్ వల్ల వేగంగా వచ్చే ఆటోలు, కారులు ఒక్కసారిగా వేగం తగ్గించడంతో వెనుక వచ్చే భారీ వాహనాలు వేగం అదుపు తప్పడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే రంబుల్ స్ట్రిప్స్ మందం 7.5 మి.మీలు ఉంటే అన్నీ వాహనాలు హైవేపై వచ్చే వేగంతో వెళ్లే అవకాశముంటుంది. అతి ఎక్కువ మందం ఉండడం వల్ల ఇక్కడ వాహనాల వేగం తగ్గడం.. దీనికితోడు ఆ పరిసర ప్రాంతాల్లోనే రెండు పెట్రోల్ బంక్‌ల నుంచి వచ్చే వాహనాల వల్ల కూడా హైవేపై వెళ్లే వాహనాల డ్రైవర్లకు ఇబ్బంది కలిగించే అంశంగా మారిందనే చర్చ ప్రభుత్వ విభాగాల్లో జరుగుతోంది. ముఖ్యంగా మామూనూరు వద్ద నిబంధనలకు విరుద్ధంగా సమీపంలో జంక్షన్ లేకున్నా, రోడ్డు కుంగిన ప్రాంతాలు లేకున్నా థర్మోప్లాస్టిక్ రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేశారు. అదీకాకుండా మందం ఎక్కువతో చేయడం కూడా రోడ్డు ప్రమాదానికి కారణమని తెలుస్తోందని వాహనదారులు పేర్కొంటున్నారు. ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోతే, సోమ, మంగళవారం కూడా ఇక్కడ రోడ్డు ప్రమాదాలు జరిగి స్వల్ప గాయాలతో బయటపడ్డారని గుర్తు చేసుకుంటున్నారు. జాతీయ రహదారిపై వేగ నియంత్రణ కోసం లేజర్ స్పీడ్ గన్స్ సంఖ్య పెంచాలి. ప్రమాద స్థలాన్ని వాహనదారులకు తెలిసేలా పవర్ బ్లింకర్స్, సైన్‌బోర్డులు, బారికేడ్లు, సీసీ కెమెరాలు, సోలార్ స్టైన్స్ ఏర్పాటు చేయాలని పలువురు వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

రవాణా శాఖ అధ్యయనంలో తెలిసిన అంశాలు ఏమిటంటే..

- పంథిని శివారులో రోడ్డుకు సమానంగా లేని ఇరుకైన వంతెనను దాటుతుండగా యూరియా బ్యాగుల లోడ్‌తో వెళ్తున్న ప్యాసింజర్ ఆటోను ట్రక్ డ్రైవర్ ఢీకొట్టాడు. ఇరుకైన వంతెన దగ్గర 20 మీటర్ల స్కిడ్ గుర్తులు కనిపించాయి.
- ఆటో డ్రైవర్ రంబుల్ స్ట్రిప్స్ దగ్గర తన వేగాన్ని తగ్గించే సమయంలో వెనుక వైపు నుంచి వచ్చే వాహనాల గురించి వెనుక వీక్షణ అద్దాన్ని గమనించాలి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ రంబుల్ స్ట్రిప్స్ దగ్గర వేగం తగ్గించే ముందు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదు.
- ట్రక్ డ్రైవర్ ఎక్కడ మద్యం సేవించాడు.. అతను ప్రమాద స్థలానికి చేరుకునే వరకు మద్యం సేవించిన తర్వాత ఎంత దూరం ప్రయాణించాడనే అంశం తెలియాల్సి ఉంది. పురపాలక పరిమితులు మినహా జాతీయ రహదారులపై మద్యం దుకాణాలు నిషేధించబడ్డాయి.
- మున్సిపల్, గ్రామ పంచాయతీ పరిధిలో మినహా జాతీయ రహదారులపై ప్యాసింజర్ ఆటోలను అనుమతించరు.

వేసవికి సన్నద్ధం కావాలి

- ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయాలి
- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి


మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: వేసవిలో విద్యుత్ సంబంధ సమస్యలు నివారించేందుకు అధికారులు ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లు, నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 16 సర్కిళ్ల పరిధిలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా తీసుకున్న చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ వేసవి కాలానికి అధికారులు పూర్తిగా సమాయత్తం కావాలని, అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 16 సర్కిళ్లకు నోడల్ ఆఫీసర్లను నియమించామన్నారు. నేడు (బుధవారం) సర్కిళ్లలో జరిగే సమావేశంలో నోడల్ ఆఫీసర్లు పాల్గొని రూపొందించిన ప్రణాళిక మేరకు పనులు జరిగాయా లేదా అని సమీక్షించాలన్నారు. ఓవర్ లోడ్ ఉన్న చోట ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచాలని, అవసరమున్న చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర సర్వీస్‌లో భాగమైన జిల్లా ఆస్పత్రులు, ఇతర సర్వీసులకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించేందుకు ఇంటర్ లింకింగ్ లైన్ల వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, టి.మధుసూదన్, వి.తిరుపతి రెడ్డి, సీఈలు రాజుచౌహన్, బీకం సింగ్, అశోక్, కె.ఎస్. గుట్ట, తదితరులు పాల్గొన్నారు.

అనుమానం పెనుభూతమైంది..

- భార్యను కత్తితో పొడిచిన భర్త
- చికిత్స పొందుతూ మృతి


సుగుణ(ఫైల్)

కేసముద్రం: అనుమానం పెనుభూతమైంది. భార్యతో కడ వరకూ జీవించాల్సిన ఓ భర్త...ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. కర్రతో తలపై కొట్టి, ఆపై కత్తితో పొట్టలో పొడిచాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషాదకర ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం వెంకటగిరిలో చోటుచేసుకుంది. రూరల్ సీఐ సర్వయ్య కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వాంకుడోత్ రఘు.. గూడూరు మండలం చిన్న ఎల్లాపూర్‌కు చెందిన కున్‌సోతు హట్యా, తారి దంపతుల కూతురు సుగుణ(25)ను వివాహం చేసుకున్నాడు. రఘు జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ క్రమంలో కొంతకాలంగా సుగుణపై రఘు అనుమానం పెంచుకుని తరచూ గొడవ పడుతున్నాడు. ఈనెల 25న కూడా గొడవపడి క్షణికావేశంలో భార్య తలపై కర్రతో కొట్టి, ఆపై కత్తితో పొట్టలో పొడిచాడు. గమనించిన కుటుంబీకులు సుగుణను వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి హట్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ తెలిపారు.

రూ. 3 లక్షల చెల్లిస్తే జాబ్ ఇప్పిస్తా..

- మొదట రూ. 10 వేలు అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయండి.. జాబ్ రిజ్వర్ చేస్తాం
- ఎన్‌హెచ్‌ఎం అధికారులమంటూ అభ్యర్థులకు ఫోన్ కాల్స్



ఎంజీఎం : రూ. 3 లక్షల చెల్లిస్తే వైద్యారోగ్యశాఖలో రెగ్యులర్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఆశావాహ అభ్యర్థుల ఫోన్ నంబర్లు సేకరించిన దళారులు.. ఎన్‌హెచ్‌ఎం అధికారుల పేరుతో వసూళ్ల దందాకు దిగుతున్నారు. కొన్ని నెలల క్రితం ఉద్యోగాల కోసం రాసిన పరీక్షలను ఆధారం చేసుకుని అభ్యర్థుల ఫోన్ నంబర్లు సంపాదిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం హనుమకొండ జీఎంహెచ్‌లో పనిచేసే ఓ ఉద్యోగికి 'మీరు రాసిన పరీక్షలో 74 మార్కులు వచ్చాయి..సెలెక్ట్ కాలేదు.. కానీ.. నేను సెలక్ట్ అయ్యేటట్టు చేస్తా.. ముందు మా అకౌంట్‌కు రూ. 10 వేలు పంపించండి.. ఆ డబ్బులు కూడా ఎలా మా అకౌంట్‌కు పంపించాలో మీరు మీ అకౌంట్‌లో డబ్బులు జమ చేసుకున్నాక చెబుతా.. రూ. 10 వేలు మా అకౌంట్‌కు పంపించగానే మీ జాబ్ లాక్ చేస్తాం.. ఇది ఇన్‌సైడ్ కాల్.. ఎవరికీ చెప్పొద్దు. చెబితే మీకు నష్టమే.. మాకూ నష్టమే.. మీ ప్రొవిజనల్ లిస్టు తయారు చేసి మెరిట్ లిస్టులో మీ పేరు వచ్చేలా చేస్తాం. అనంతరం ఇంటర్వ్యూలో సెలక్ట్ అయ్యాక మాకు మిగతా 2.90 లక్షలు చెల్లించాలి.. మీకు మరో గంటలో ఫోన్ చేస్తా' అని సదరు ఉద్యోగికి 9883550117 అనే నంబర్ ద్వారా ఫోన్ వచ్చింది. ఇదే నంబర్‌తో మరో గంటకు ఫోన్ చేసి అకౌంట్‌లో డబ్బు జమ చేసుకున్నారా మా సార్‌కు మీతో మాట్లాడారని చెప్పారు.. అమౌంట్ ట్రాన్స్‌ఫర్ చేయండి.. మీ జాబ్ లాక్‌చేశామని తిరిగి గంట తరువాత మరో ఫోన్ కాల్ చేస్తామన్నారు. ఇలా ఒకరిద్దరికి కాదు.. పరీక్ష రాసిన వందలాది మందికి దళారులు కాల్స్ చేస్తున్నారు. దీంతో అభ్యర్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అలాగే, ఎన్‌హెచ్‌ఎం అధికారుల మంటూ వస్తున్న ఫోన్ కాల్స్‌తో ఉద్యోగులు కూడా అయోమయానికి గురవుతున్నారు.

నియామకం


నియామక పత్రం అందజేస్తున్న చిరంజీవులు

హన్మకొండ : బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ కొంగ వీరస్వామిని నియమించారు. మంగళవారం హైదరాబాద్ జరిగిన కార్యక్రమంలో వీరస్వామిని నియమిస్తూ రాష్ట్ర చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ టి.చిరంజీవులు నియామక పత్రాన్ని అందించారు. జిల్లాలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరంను పటిష్టం చేయడంతో పాటు హక్కుల సాధనకు కృషి చేయాలని సూచించారు. బాధ్యతలు అప్పగించిన బాధ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- సీపీ అంబర్ కిశోర్ ఝా


మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

వరంగల్ క్రైం : శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా.. అధికారులకు సూచించారు. కమిషనరేట్ పోలీసు అధికారులతో సీపీ మంగళవారం నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా పోలీస్‌స్టేషన్, డివిజనల్, జోన్ల వారీగా పెండింగ్ కేసుల్లోని నిందితుల అరెస్ట్, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జ్‌షీట్‌కు సంబంధించి కేసుల స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణకు అధికారులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యల చర్చించారు. నేరాల కట్టడికి ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో ముందుకు వెళ్లాలని, మహిళలకు సంబంధించిన కేసులపై అధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు. పెండింగ్, మిస్సింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. నిజాయితీగా పనిచేయాలని, సివిల్ పంచాయితీలకు దూరంగా ఉండాలన్నారు. తప్పుడు కేసు నమోదు చేయొద్దని, పోలీసులు అప్రమత్తంగా లేకుంటే శాంతిభద్రతలు అదుపు తప్పుతాయని వివరించారు. రౌడీ షీటర్ల స్థితిగతులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని సూచించారు. సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రవీందర్, ఏఎస్పీ చేతన్‌తో పాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న టీచర్లపై ఫిర్యాదు?

తొర్రూరు రూరల్: మండలంలోని అరిపిరాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో కొంత మంది ఉపాధ్యాయులు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తూ తల్లిదండ్రులు, గ్రామ యువకులు మండల విద్యాశాఖ అధికారులు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మంగళవారం తెలిసింది. విద్యార్థినులతో కొంతమంది ఉపాధ్యాయుల ప్రవర్తన సరిగా లేదని యువకులు, తల్లిదండ్రులు హెచ్‌ఎంతో గొడవ పడ్డారని సమాచారం. అంతేకాకుండా సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల విద్యాశాఖ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

రాష్ట్రస్థాయి పోటీల్లో పోలీస్ జట్లు


మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న వరంగల్ కమిషనరేట్ జట్టు


యాదాద్రి జోన్ జట్టు


కాళేశ్వరం జోన్ జట్టు


భద్రాద్రి జోన్ జట్టు

కరీంనగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం రాష్ట్రస్థాయి 3వ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ప్రారంభమైంది. వివిధ జోన్ల నుంచి 2,380మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో ఉమ్మడి జిల్లా పరిధిలోని పలుజోన్లు, వరంగల్ కమిషనరేట్ జట్టు పాల్గొన్నాయి. ముందుగా ఆయా జట్లు మార్చ్‌ఫాస్ట్ చేశాయి.

- కరీంనగర్

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

- టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్


మాట్లాడుతున్న టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్

విద్యారణ్యపురి : తాను వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉండబోతున్నానని, తనను గెలిపిస్తే ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని ఎస్టీయూ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరునెలలుగా ఈ-కుబేర్‌లోపెండింగ్‌లో ఉన్న బిల్లులు, డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొత్త పీఆర్‌సీ అమలు చేయాలన్నారు. హెల్త్‌కార్డుల ద్వారా సంపూర్ణ వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. ఇంకా మిగిలిన 317 జీఓ బాధితులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం. పర్వతరెడ్డి, జనరల్ సెక్రటరీ సదానందగౌడ్, టీపీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. చెన్నయ్య,ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, బీసీటీఏ అధ్యక్షుడు కృష్ణుడు, బీసీటీయూ అధ్యక్షుడు శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పెంట అంజయ్య, ప్రధాన కార్యదర్శి దానయ్య, టీజీహెచ్‌ఎం అసోసియేషన్ అధ్యక్షుడు జి. హేమచంద్ర, ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ ఆట సదయ్య మాట్లాడారు. సమావేశంలో ఎస్టీయూ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామగోని రాంబాబు, మధులిమాయే, వేమునూరు రాంబాబు, నాగరాజు పాల్గొన్నారు.

216 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- అప్పరాజ్‌పల్లిలోని రాజరాజేశ్వరి రైస్ మిల్లులో ఘటన


పట్టుకున్న బియ్యం లారీని చూపుతున్న విజిలెన్స్ అధికారులు

గూడూరు : ఓ మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన రూ. 7.12 లక్షల విలువైన 216 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు ఓ లారీ, రెండు ద్విచక్రవాహనాలను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ ప్రభాకర్ రావు మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం అప్పరాజ్‌పల్లిలోని రాజరాజేశ్వరి రైస్ మిల్లు యజమాని భూక్య నవీన్ కొంతకాలంగా అక్రమంగా రేషన్ బియ్యం వ్యాపారం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన రూ. 7.12 లక్షల విలువైన 216 క్వింటాళ్ల (432 బస్తాలు) రేషన్ బియ్యాన్ని లారీలో లోడ్ చేస్తున్నాడు. అలాగే, ఇద్దరు వ్యక్తులు గ్రామాల్లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని ద్విచక్ర వాహనాలపై మిల్లుకు తరలిస్తున్నారు. దీనిపై విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, జిల్లా సివిల్ సప్లై అధికారులు వెంటనే గ్రామానికి చేరుకుని మిల్లులో తనిఖీ చేపట్టి రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని కేసముద్రంలోని గిడ్డంగికి తరలించారు. అనంతరం రెండు ద్విచక్రవాహనాలు, లారీని గూడూరు పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనలో మిల్లు సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఓఎస్డీ ప్రభాకర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ స్పెషల్ ఆఫీసర్ (హైదరాబాద్) లక్ష్మారెడ్డి, జిల్లా సివిల్ సప్లై అధికారి ప్రేమ్‌కుమార్, ఎస్సై గిరిధర్ రెడ్డి, ఎంఆర్‌ఐ మల్లయ్య, ఏఎస్‌ఓ రమేశ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఈజీఎస్ ఈసీ దుర్మరణం

- ఆలేరు రైల్వే స్టేషన్‌లో ఘటన


జగదీశ్ (ఫైల్)


బచ్చన్నపేట : మండల కేంద్రంలో ఈజీఎస్ ఈసీగా విధులు నిర్వర్తిస్తున్న కోరాటి జగదీశ్ (41) రైలు ఢీకొని దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి ఆలేరు రైల్వే స్టేషన్‌లో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని అల్వాల్‌కు చెందిన జగదీశ్ బచ్చన్నపేట మండల కేంద్రంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఈసీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రోజూ హైదరాబాద్ నుంచి రైలులో ఆలేరు వరకు వచ్చి అక్కడి నుంచి బైక్‌పై బచ్చన్నపేటకు వస్తాడు. ఈ క్రమంలో సోమవారం విధులు ముగించుకుని బైక్‌పై ఆలేరు వెళ్లి అక్కడి రైల్వేస్టేషన్‌లో పార్క్ చేశారు. అనంతరం రైలు ఎక్కడానికి పట్టాలు దాటుతున్నాడు. ఈ క్రమంలో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడికి భార్య స్రవంతి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా, ఏపీఓ కృష్ణ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు.. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం జగదీశ్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి


రాజు మృతదేహం

ఎల్కతుర్తి : తాటిచెట్టుపై నుంచి పడి ఓ గీతకార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొక్కిస రాజు(35) రోజుమాదిరిగానే కల్లు గీయడానికి తాటిచెట్టు ఎక్కాడు. కల్లు దింపుతున్న క్రమంలో మోకు జారీ చెట్టుపై నుంచి పడ్డాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు. మృతుడికి భార్య స్వప్న, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కాజీపేట మీదుగా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు



కాజీపేట రూరల్ : మహా కుంభమేళా యాత్రీకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాజీపేట జంక్షన్ మీదుగా నాలుగు అదనపు ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం రాత్రి తెలిపారు.

ప్రత్యేక రైళ్ల వివరాలు..

ఫిబ్రవరి 5వ తేదీన చర్లపల్లి–దానాపూర్ (07079) ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు 17.00 గంటలకు చేరుకుంటుంది. ఫిబ్రవరి 7వ తేదీన దానాపూర్–చర్లపల్లి (07080) ఎక్స్‌ప్రెస్ 8వ తేదీన కాజీపేటకు రాత్రి 21.45 గంటలకు చేరుతుంది. ఫిబ్రవరి 7వ తేదీన చర్లపల్లి–దానాపూర్ (07077) ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు 17.00 గంటలకు చేరుతుంది. ఫిబ్రవరి 9వ తేదీన దానాపూర్–చర్లపల్లి (07078) ఎక్స్‌ప్రెస్ 10వ తేదీన 21.45 గంటలకు కాజీపేటకు చేరుతుంది. ఈ ప్రత్యేక రైళ్లకు జనగామ, కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్‌నగర్, బల్హార్షా, చంద్రాపూర్, సేవాగ్రామ్, నాగ్‌పూర్, ఇటార్సీ, పిపర్యా, జబల్‌పూర్, కట్నీ, సంత, మణిక్‌పూర్, ప్రయాగ్‌రాజ్, చోకి, మీర్జాపూర్, పండిట్ దిన్ దయాల్ ఉపాధ్యాయ, బాక్సర్, అరా స్టేషన్లలో హాల్టింగ్ కల్పించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ 'రెగ్యులర్ & డిస్టెన్స్ : డిగ్రీ, PG, బి.టెక్, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA (4 నెలల్లో పూర్తి) Dr.J.S అకాడమి (ISO 9001:2015 సర్టిఫైడ్) 8866977112 [HA-15420]

REAL ESTATE
HOUSE FOR SALE
■ WGL కొత్తవాడ 180 ఫీట్ రోడ్, డా॥ మల్లికార్జున్ హాస్పిటల్ దగ్గరలో 113 గజాల ఈస్ట్ ఫేస్ ఇండిపెండెంట్ హౌస్ అమ్మబడును. సెల్: 7660866669. [SCA25001378]

SERVICES
BUSINESS OFFER
■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషీన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6200]

BUSINESS SERVICES
■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మర్వాడి షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9177555694 స్పాట్ క్యాష్. [SCA25001311]

WANTED
■ మా అపార్ట్మెంట్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ సూపర్‌వైజర్స్ వాచ్మేన్స్ కావలెను. సంప్ర: 7382323126, 9491710857. [SCA25001417]
■ మా ఆఫీసులో పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను రంగశాయిపేట వరంగల్. సంప్ర: 6305324490. [SCA25001424]
■ మా ఆఫీసులో పనిచేయుటకు రిసెప్షనిస్ట్ టెలికాలర్ మేనేజ్మెంట్ CO ఆపరేటర్ మార్కెటింగ్ ఫ్రీలు కావాలి 7382106287, 9491706517. [SCA25001420]
■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256049]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీతం: 18K Ph: 9160900024, 9640400073. [SCA25001362]
■ హనుమకొండ ప్రముఖ ల్యాబ్ కొరకు హౌస్ కీపింగ్ బాయ్స్ / లేడీస్ అర్జెంటు గా కావలెను. 9 గం॥ డ్యూటీ 2 షిఫ్ట్ 6.30–3.30 & 12–9pm 4 వీక్లీ ఆఫ్స్ ESI, PF మంచి జీతం. సంప్ర : 9032153413. [SCA25001413]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.